సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



ఉచిత శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మలక్‌పేట: సలీంనగర్‌లోని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్‌లో శనివారం మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి కంటి వైద్య ప్రారంభించి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు తమ ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. పెద్ద సంఖ్యలో పెన్షనర్లు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మాక్సివిజన్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేసి తగు సలహాలు, సూచనలు చేశారు. ఉచిత వైద్య శిబిరంలో హాస్పిటల్ ఈహెచ్‌ఎస్ మేనేజర్ మహేందర్, మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ మహేష్, అసోసియేషన్ సెక్రటరీ జనరల్ చోళ ఓంప్రకాశ్‌యాదవ్, అసోసియేట్ ప్రెసిడెంట్ మదన్‌మోహన్‌రావు, కోశాధికారి ప్రసాద్‌రావు, ఆఫీస్ బేరర్స్, సభ్యులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

ఎల్‌బీనగర్: మల్కాజిగిరి పార్లమెంటరీ పరిధిలోని ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ఈ నెల 4వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరగనుంది. ఇందు కోసం అధికారులు లెక్కింపు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎల్‌బీనగర్ రిటర్నింగ్ సహాయ అధికారి పంకజ తెలిపారు. లెక్కింపునకు సుమారు 500 మంది సిబ్బందిని నియమించామన్నారు. మొత్తానికి 28 రౌండ్లలో జరిగే ఈ లెక్కింపునకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రౌండ్ల వారీగా ఫలితాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన



ఉచిత శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మలక్‌పేట: ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా శనివారం దిల్‌సుఖ్‌నగర్ శ్రేష్ఠ శ్రీ కమలా ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. డాక్టర్ సునీల్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఉపయుక్తంగా ఉంటాయని, వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, దంత సమస్యలకు పరీక్షలు చేశారు. ఫైబ్రో స్కాన్, 50 ఏళ్లకు పైబడిన వారికి బీఎండీ, ఈసీజీ, జీఆర్‌బీఎస్, సీబీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు బాలాజీ ప్రసాద్, రాకేష్‌కుమార్, రాకేష్, మార్కెటింగ్ ఇన్‌చార్జి ఆనంద్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం



పాల్గొన్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శనివారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ మధురాపురిలోని స్వర్ణకార వీధిలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో వీరబ్రహ్మేంద్రస్వామి స్వామి పూజ, మూల మంత్ర హోమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామరంగా రెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. జరగబోయే ఘటనలను తన శక్తితో ముందే ఊహించి కాలజ్ఞానంలో రాసిన మహాపురుషుడు వీరబ్రహ్మేంద్ర స్వామి అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీరామదాసు రవిచారి, గౌరవ అధ్యక్షుడు ఎర్రోజు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి లవకుమార్, కోశాధికారి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

సమాచార రంగంలో అగ్రగామిగా దేశం



బీఎస్ఎన్ఎల్ మాజీ ఉన్నతాధికారి వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న చంద్రకుమార్

హస్తినాపురం: సమాచార, కమ్యూనికేషన్ రంగంలో నేడు మన దేశం అగ్రగామిగా ఉందని ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. హస్తినాపురంలోని సాంస్కృతిక సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో ప్రపంచ టెలికం దినోత్సవం సందర్భంగా బీఎస్ఎన్ఎల్‌లో 35 సంవత్సరాలు సేవలందించిన మాజీ ఉన్నతాధికారి జి.వెంకటేశ్వర్లును శనివారం చంద్రకుమార్ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, టెలికాంలో విప్లవాత్మక మార్పులు లేకుంటే జీవితం ఎలా ఉండేదోనని ఇప్పటి తరానికి ఊహించడం కూడా కష్టమేనన్నారు. టెలికాం వ్యవస్థ ప్రస్తుతం ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో కీలకపాత్ర పోషిస్తోందని అన్నారు. భారత్‌లో రైతులు కూడా సమాచార పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం శుభపరిణామం అని అన్నారు. కార్యక్రమంలో ఆకృతి సుధాకర్, జీవీఎస్ కిరణ్, బీఎస్ఎన్ఎల్ మాజీ అధికారులు రమేష్‌బాబు, శరణ్యాచార్యులు, ఎస్ఎన్ శాస్త్రి పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

జాతీయ రహదారిపై భారీగా చేరిన వరద నీరు

- చింతలకుంటలో చిన్నపాటి చెరువులా మారిన రహదారి
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్‌బీనగర్: ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలోని శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో సుమారు గంట పాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. జాతీయ రహదారిపై భారీగా వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వనస్థలిపురంలోని చింతల్‌కుంట వద్ద రోడ్డుపై వరద నీరు చేరడంతో చిన్నపాటి చెరువును తలపించింది. ఈ రహదారిపై వాహనాలు రద్దీ ఏర్పడటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో చింతల్‌కుంట నుంచి అంబర్‌పేట వరకు వాహనాలు నెమ్మది నెమ్మదిగా కదిలాయి. బీఎన్‌రెడ్డి, నాగోలు, లింగోజిగూడ, మన్సూరాబాద్, హస్తినాపురం, కొత్తపేట, గడ్డిఅన్నారం, దిల్‌సుఖ్‌నగర్, అల్కాపురి చౌరస్తా, మూసారంబాగ్ చౌరస్తా, నల్గొండ క్రాస్‌రోడ్డు, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించడంతో కొద్దిసేపు రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. ఈదురు గాలులకు కొన్ని చోట్ల చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. వర్షం వల్ల పలు ప్రాంతాల్లో సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



చింతల్‌కుంట వద్ద జాతీయ రహదారిపై వరద నీరు



నీట మునిగిన వాహనం

అయ్యప్ప కాలనీలో చేరిన వరద నీరు



అయ్యప్పనగర్‌కు వరద

ఇళ్లలోకి చేరిన నీరు

నాగోలు: భారీ వర్షం వల్ల నాగోలు డివిజన్ బండ్లగూడ పరిధి అయ్యప్పనగర్‌లోని కొన్ని ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పై కాలనీల నుంచి వరద నీరు అయ్యప్పనగర్ కాలనీలో వచ్చింది. ఒక్కసారిగా వరద రావడంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గత కొన్నేళ్లుగా వర్షం వచ్చినప్పుడు వరద ముంపుతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.



మన్సూరాబాద్‌లో కాలనీలోకి చేరిన వరద



రోడ్డుపైకి వరద నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



వర్షంతో ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు



ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు సమీపంలో నీట మునిగిన కార్లు

నేత్రపర్వంగా వాసవి మాత జయంత్యుత్సవం



అమ్మవారి పూజలో పాల్గొన్న మహిళలు

మలక్‌పేట: మూసారంబాగ్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం డివిజన్‌లోని శాలివాహననగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉత్సవాల్లో సంఘం అధ్యక్షుడు దిగంబర్, సెక్రటరీ యుగంధర్, ట్రెజరరీ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ నగర్‌లో...

వనస్థలిపురం: సచివాలయనగర్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి అమ్మవారి జయంతిని నిర్వహించారు. ప్రత్యేక పూజలుతో పాటు సామూహిక సహపంక్తి భోజనాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు,ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

కమర్షియల్ టాక్స్ కాలనీలో...

నాగోలు: వాసవి మాత జయంతి సందర్భంగా కొత్తపేట డివిజన్ ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో కమర్షియల్ టాక్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 108 మంది మహిళలతో కుంకుమార్చన, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ పవన్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు ధీరజ్ రెడ్డి పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో...

నాగోలు: గడ్డి అన్నారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుష్పగిరి పీఠాధిపతి విద్యానంద శంకర భారతి మహాస్వామి పాల్గొన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ అధ్యక్షుడు కోలేటి దామోదర్, సంఘం అధ్యక్షుడు ఎంఎల్ఆర్ గుప్తా, ఉపేందర్ గుప్తా, ప్రవీణ్, బాలయ్య, కృష్ణ, నరేష్ పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యానంద శంకర భారతి స్వామి, కోలేటి దామోదర్



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మదర్ డెయిరీ నూతన వేరియంట్ ఆవిష్కరణ



నూతన వేరియంట్ పాలను ఆవిష్కరిస్తున్న చైర్మన్

హయత్‌నగర్: నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల యూనియన్ (నార్ముల్ మదర్ డెయిరీ) నూతనంగా ఉత్పత్తి చేసిన 'మదర్ విజయ' పాలను శనివారం సంస్థ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి హయత్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారుల అభిరుచికి తగ్గట్లుగా సంస్థ పలు రకాల పాల ఉత్పత్తులను మార్కెట్‌లో ప్రవేశ పెట్టిందన్నారు. నూతనంగా ఆవిష్కరించిన ఈ వేరియంట్‌లో పాల నాణ్యతను మరింతగా పెంచామని, ఇది వినియోగదారులకు నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పైతల పుంచి సేకరించిన పాలనే 24 గంటలలోపు వినియోగదారులకు అందిస్తున్నామని, అటు రైతులు ఇటు వినియోగదారులకు ఉపయోగంగా ఉండేందుకు ఎప్పటికప్పుడు నూతన ఉత్పత్తులను తయారు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జలంధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జయశ్రీ, ఉప్పల వెంకట్‌రెడ్డి, సంస్థ ఎండీ కృష్ణ, డీజీఎంలు దివాకర్, శివకుమార్, ఏజీఎం జీవీఎస్‌రెడ్డి, ఏఓ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో పాగాకు పన్నాగాలు

- అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు మాయం
- శాలివాహ నగర్‌లో కబ్జాను అడ్డుకున్న స్థానికులు

మలక్‌పేట: కోట్ల రూపాయాల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు భూకబ్జాదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. రెవెన్యూ, ప్రజా ప్రతినిధులు ఎన్నికల హడావుడిలో ఉండగా..కబ్జాదారులు మెల్లగా ఖాళీ స్థలాల్లో పాగా వేసేందుకు పన్నాగాలు పన్నారు. సైదాబాద్ మండలం మూసారంబాగ్ డివిజన్‌లో ఇటీవల రెండు ఘటనలు జరిగిన విషయం తెలిసిందే. సలీంనగర్, శాలివాహననగర్, ఫ్రెండ్స్‌కాలనీ, అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలలో రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించాలని చూస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏర్పాటు చేసిన బోర్డులు కన్పించడం లేదు. తప్పుడు పత్రాలు సృష్టించి స్థానిక నేతల అండదండలతో ఆ స్థలాలను కబ్జా చేయడానికి యత్నిస్తున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చిన సకాలంలో స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



శాలివాహననగర్‌లో ఇటీవల కబ్జాదారులు చదును చేసిన ప్రభుత్వ స్థలం

బోర్డులు మాయం..

సలీంనగర్ రెవెన్యూ భవన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం (బోనోవెకెన్సీ ల్యాండ్) కబ్జా చేయడానికి భూ కబ్జాదారులు అనేక రకాల కుట్రలు చేశారు. కాలనీవాసుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు ఖాళీ స్థలంలో బోర్డు పెట్టారు. పక్కన గోడపై బోనోవెకన్సీ ల్యాండ్ అని రాయించారు. ఇప్పుడు ఆ బోర్డు కనిపించడం లేదు. శాలివాహనగర్‌లో ఖాళీ స్థలాన్ని కబ్జా చేయడానికి ఇటీవల భూమిని చదును చేయగా స్థానికులు అడ్డుకున్నారు. శాలివాహననగర్ అంబేడ్కర్‌నగర్, ఫ్రెండ్స్ కాలనీల్లోని ప్రభుత్వ స్థలాల్లో బోర్డులను ఎవరో మాయం చేశారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కబ్జాదారులు బోర్డులను పీకేసి ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలలను సందర్శిస్తాం. బోర్డు లేని చోటా బోర్డులు పెట్టిస్తాం. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి కాకుండా రక్షణ చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నట్లు తెలిస్తే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరుతున్నారు.

– జయశ్రీ, తహసీల్దార్, సైదాబాద్

నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టురట్టు

ఇద్దరి అరెస్టు



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న నకిలీ సర్టిఫికెట్లు

చైతన్యపురి: సులువుగా డబ్బులు సంపాదించేందుకు నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయిస్తున్న ఓ ముఠా గుట్టురట్టు చేశారు మహేశ్వరం ఎస్ఓటీ, చైతన్యపురి పోలీసులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురి లావెర్స్ కాంప్లెక్స్‌లో నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా ముఠా గుట్టు రట్టైంది. మెహిదీపట్నం రెతిబౌలీలో మహ్మద్ అబ్రాస్ హుస్సేన్ (45) కన్సల్టెన్సీ వర్క్స్ పేరుతో కార్యాలయం నిర్వహిస్తునాడు. ఇతను ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రాంసింగ్ సహకారంతో వివిధ యూనివర్సిటీల డిగ్రీ సర్టిఫికెట్లు తయారు చేసి అవసరమైన వారికి రూ.30 వేలు నుంచి రూ. 40 వేలకు విక్రయిస్తున్నాడు. అలాగే, నగరంలోని పలు ప్రాంతాల్లో గల కన్సల్టెన్సీ ఏజెన్సీల ద్వారా అవసరమైన వారికి నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నాడు. ఏజెన్సీల వారికి ఒక్కో సర్టిఫికెట్‌కు రూ. 2 వేల నుంచి రూ.4 వేలు కమీషన్ ఇస్తున్నాడు. మహాత్మాగాంధీ, కాశీ విద్యాపట్, వారణాసి, బీహార్‌లోని బాబా సాహెబ్ అంబేడ్కర్ యూనివర్సిటీలకు చెందిన డిగ్రీ మార్కుల మెమో, ప్రోవిజనల్ సర్టిఫికెట్లు, ఎక్స్‌పీరియన్స్, ఆఫర్ లెటర్లు, రికమెండేషన్ లెటర్లు కంప్యూటర్‌పై నకిలీవి తయారు చేసి విదేశాలకు వెళ్లే వారికి అందజేసి భారీగా డబ్బు సంపాదిస్తున్నాడు. పోలీసులు ప్రధాన నిందితుడు మహమ్మద్ అబ్రాస్ హుస్సేన్‌తో పాటు ఫేక్ సర్టిఫికెట్ కలిగి ఉన్న సయ్యద్ ఇన్నానియస్ మహమ్మద్ (25)లను అరెస్ట్‌చేసి కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈటలను కలిసిన బీజేపీ నాయకులు



ఈటల రాజేందర్‌ను కలిసిన కార్పొరేటర్ అరుణ సురేందర్ తదితరులు

నాగోలు: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను శనివారం మేడ్చల్‌లో నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ-సురేందర్ యాదవ్, ఇతర బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలు, పోలింగ్ సరళి గురించి తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు పంగా శ్యామ్‌కుమార్, పాల్వాయి సంజీవరెడ్డి, డప్పు రాజు, కేశిరెడ్డి పద్మరెడ్డి, వస్పారి మల్లేష్, దినేష్, రాముగౌడ్, మనోజ్, ప్రీతం రెడ్డి, అనిల్, అశోక్, పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

చైతన్యపురి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు అదృశ్య ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపేట ఆర్‌బీఐ కాలనీలో నివసించే ప్రైవేట్ ఉద్యోగి దుర్గాప్రసాద్ కుమారుడు కార్తీక్ (7)కు మతిస్థిమితం సరిగా ఉండదు. శుక్రవారం సాయంత్రం ఆరుగంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన కార్తీక్ ఇంటికి తిరిగి రాలేదు. అతడి కోసం వెతికినా జాడ తెలియక పోవటంతో శనివారం చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కార్తీక్

వర్షా కాలంలోపు పెండింగ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయండి

నాగోలు: రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. శనివారం కొత్తపేట డివిజన్ మారుతి నగర్‌లో నూతన భూగర్భ డ్రైనేజీ లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ పనులు పూర్తి చేయాలన్నారు. డివిజన్‌లో చాలా చోట్ల డ్రైనేజీ లైన్ పనులు పెండింగ్ లో ఉన్నాయని, ఇప్పటికే అనుమతి మంజూరైన పనులను వచ్చే వర్షాకాలం లోపల పూర్తి చేయాలని జలమండలి అధికారులు ఆరిఫ్, సూపర్‌వైజర్ దయాకర్‌ను కోరారు, కార్యక్రమంలో నాయకులు కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి, తోట మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి...

కొత్తపేట డివిజన్ శృంగేరి కాలనీలోని శ్రీకృపా అపార్ట్‌మెంట్ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించాలని చూస్తున్నారని, ఆ స్థలాన్ని కాపాడాలని శ్రీకృపా అపార్ట్‌మెంట్ సభ్యులు శనివారం కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలం కబ్జాలకు గురి కాకుండా చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. అపార్ట్‌మెంట్ వాసులు సీవీఎస్ రావు, తిరుపతి రెడ్డి, ప్రకాశ్ శర్మ, శ్రీనివాస్ శాస్త్రి, రాధా, చలపతి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 19, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాబేజి 18, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 35, దొండ 28–33, చిక్కుడు 65, గోకర 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 60, ఆలు 28, దోస 23, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 45. ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.